క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి పూలంగిసేవ



పూలంగిసేవలో వేంకటేశ్వరస్వామి

జామి: మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వస్వామి ఆలయంలో స్వామివారికి ఆలయప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో శనివారం పూలంగిసేవ నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

రూ.3 లక్షలతో సీసీ కాలువల నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుర్ల: మండలంలోని బోడవరం గ్రామం రూ.3 లక్షల మండల పరిషత్ నిధులతో సీసీ కాలువలు నిర్మిస్తున్నామని ఎంపీటీసీ అట్టాడ సంధ్యారాణి శనివారం తెలిపారు. రజక వీధిలో చేపడుతున్న ఈ పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుమరెడ్డి సురేష్, అట్టాడ అప్పలరాజు పర్యవేక్షించారు. కాలువల నిర్మాణం అనంతరం సీసీ రోడ్డు నిర్మిస్తామని చెప్పారు.

సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



పోషణ కిట్లను అందజేస్తున్న సర్పంచ్ బంగారునాయిడు, ఎంపీటీసీ రామకృష్ణ

గుర్ల: మండలంలోని రాగోలులో గర్భిణులు, బాలింతలకు సర్పంచ్ చందక బంగారునాయుడు, ఎంపీటీసీ గిడిజాల రామకృష్ణ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను శనివారం పంపిణీ చేశారు. సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించా రు. విధిగా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసం పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఆశయ రమణ, హెచ్‌ఎం గోపి

చీపురుపల్లి: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి పుస్తకపఠనం అలవాటు చేసుకోవాలని పట్టణంలోని రామాంజనేయకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కంది గోపి అన్నారు. పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆ పాఠశాల విద్యార్థులు 50 మందికి వ్యక్తిత్వ వికాసం పుస్తకాలను శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎంతో విలువైన సమయాన్ని మొబైల్స్, సినిమాలు చూస్తూ కాలక్షేపం చేయకుండా మంచి పుస్తకాలు చదవాలని సూచించారు. ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం



బాధితుడికి ఆర్థిక సహాయం చేస్తున్న గోల్డెన్ హార్ట్ ట్రస్ట్ సభ్యులు

వేపాడ: మండల కేంద్రం వేపాడకి చెందిన శిరిపిపల్లి అప్పలస్వామి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడ్డారు. గ్రామానికి చెందిన గోల్డెన్ హార్ట్ ట్రస్ట్ సభ్యులు శనివారం రాత్రి బాధితుడి ఇంటికి వెళ్లి రూ.10,500 నగదు అందజేశారు. అప్పలస్వామి కుటుంబీకులు ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మీవ్రతం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లో గల భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లో శనివారం అష్టలక్ష్మీ వ్రతం వైభవంగా నిర్వహించారు. దేవాలయ అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, శ్రీనివాస రమేష్ ఆచార్యుల వేదమంత్రాల నడుమ అమ్మవారికి ప్రత్యేక ఊంజల్ సేవ చేపట్టారు. కార్యక్రమంలో దేవాలయం ధర్మకర్తలు దుర్గా బాలాజీ, ఉమాదేవి దంపతులు, నీరజమన్నే, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి
- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేసిన ఎమ్మెల్యే కడుబండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా కలిగిన మేలును, చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కొత్తవలసలోని లలితా కన్వెన్షన్ హాల్‌లో కొత్తవలస మండలస్థాయి వైఎస్సార్‌సీపీ సమావేశాన్ని ఆపార్టీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన సంక్షేమ కార్యక్రమా లను ప్రజలకు వివరించేందుకు, ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను తిప్పికొట్టేందుకు జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు క్షేత్రస్థాయిలో బలంగా పనిచేయాలని కోరారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, కరోనా వంటి రుగ్మతలు వచ్చినా ఎన్నికల హామీలను తూచా తప్పకుండా అమలుచేస్తూ, పేదల సంక్షేమమే అజెండాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత నాలుగేళ్లలో అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని, పేదల పక్షపాతిగా ముద్రపడ్డారని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గ్రామవలంటీర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, నాయకులు క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి మళ్లీ జగన్ సీఎం అయ్యేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నియోజకవర్గ పరిశీలకులు తైనాల విజయకుమార్, ఏపీ వెలమ కార్పొ రేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో పోర్టులను అభివృద్ధి చేస్తూ, పరిశ్రమలు ఏర్పాటును ప్రోత్సాహిస్తూ భావితరాలకు ఉపాధి కల్పనకు సీఎం పెద్దఎత్తున ప్రణాళిక అమలుచేస్తున్నారన్నారు. విశాఖపట్నాన్ని రాజధానిగా అభివృద్ధి చేస్తే ఉత్తరాంధ్రలో విద్య ఉపాధి కలుగుతుందన్నారు. ఎంపీపీ ఎస్.గోపెమ్మ, జెడ్పీటీసీ ఎస్.శ్రీదేవి, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొంతల వెంకటరావు, వైస్ ఎంపీపీ కర్రి శ్రీనివాసరావు, నాయకులు మేలాస్త్రి అప్పారావు, పి.ఎస్.ఎన్.పాత్రుడు, లెంక రామన్నపాత్రుడు, గొరపల్లి రవి, వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు ఐతంశెట్టి అనిల్‌కుమార్, మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ రామస్వామి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సకాలంలో బిల్లులు అప్‌లోడ్ చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్

చీపురుపల్లి: గ్రామ సచివాలయాల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులకు బిల్లులు త్వరగా వచ్చే విధంగా పనుల వివరాలను అప్‌లోడ్ చేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేక అధికారి కె.రాజ్‌కుమార్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్, నాడు–నేడు పనులకు సంబంధించిన ఇంజినీర్లతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అభివృద్ధి పనుల బిల్లులను అప్‌లోడ్ చేయడంలో జాప్యం చేస్తున్నారని, దీంతో బిల్లుల చెల్లింపు ఆలస్యమవుతోందని మండలంలోని పలువురు సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మండలంలోని అన్ని సచివాలయాల్లో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారని, పనుల పరిశీలన బాధ్యతలు వారికి అప్పగించాలని ప్రజాప్రతినిధులు కోరారు. ప్రత్యేక అధికారి స్పందిస్తూ పూర్తయిన పనులను వారం రోజుల్లో పరిశీలన చేసి బిల్లులు అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు ప్రభుత్వం నుంచి సకాలంలో బిల్లులు విడుదలవుతున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు బిల్లులు అప్‌లోడ్ చేయాల్సిన బాధ్యత ఇంజినీరింగ్‌శాఖపై ఉందన్నారు. ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు, పంచాయతీరాజ్ డీఈ చంద్రశేఖర్, జేఈ రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించండి



లక్కిడాంలో డ్రైనేజీని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

గంట్యాడ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్.భాస్కరరావు వైద్యసిబ్బందికి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో శనివారం ఆయన తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, మందుల నిల్వలను పరిశీలించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఏఎన్‌ఎంలకు, ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ ఇచ్చారా లేదా అని వైద్యాధికారులను ఆరా తీశారు. అనంతరం లక్కిడాం గ్రామంలోని వైఎస్సార్ హెల్త్ విలేజ్ క్లినిక్‌ను సందర్శించారు. విలేజ్ క్లినిక్‌లో మందులు నిల్వలు, రికార్డులను పరిశీలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసిందని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా సేవలందించాలని సిబ్బందికి సూచించారు. ఇంటింటా సర్వే చేసి ప్రజల ఆరోగ్య వివరాలను సేకరించాలన్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించారు.ఆయన వెంట హెల్త్ ఎడ్యుకేటర్ సత్యరాజ్ , ఎర్రన్న తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గడసాం విద్యార్థిని



విద్యార్థిని మల్లేశ్వరితో వ్యాయామ ఉపాధ్యాయుడు

దత్తిరాజేరు: రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు గడసాం ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని బి.మల్లేశ్వరి ఎంపికయ్యారు. ఆపాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గురునాయుడు మాట్లాడుతూ జిల్లా కేంద్రం విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-16 విభాగం 2 వేల మీటర్ల పరుగు పందెంలో మల్లేశ్వరి ద్వితీయ స్థానం సాధించిందని చెప్పారు. ఏలూరులో ఈనెల 20 నుంచి 23 వరకు నిర్వహించనున్న పోటీల్లో జిల్లా తరపున ఈ విద్యార్థిని పాల్గొననున్నారు. విద్యార్థిని సర్పంచ్ నేతేటి దీపిక, హెచ్‌ఎం రామ్మూర్తి అభినందించారు.

సమష్టిగా పనిచేస్తేనే అభివృద్ధి



ఎస్.కోట రైతుబజార్ వద్ద పరిసరాలను పరిశీలిస్తున్న డీపీఓ శ్రీధర్‌రాజా, ప్రజాప్రతినిధులు

శృంగవరపుకోట: సమష్టిగా పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని, సమస్యలూ పరిష్కారమవుతాయని ఎస్.కోట మేజర్ పంచాయతీ పాలకవర్గాన్ని ఉద్దేశించి జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) ఎల్.ఎస్.వి.శ్రీధర్‌రాజా అన్నారు. పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంద ని, తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు డీపీఓను ఆదేశించడంతో ఆయన శనివారం ఎస్.కోట పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, వార్డు సభ్యులతో సమావేశమయ్యారు. వారు వివరించిన సమస్యలు విన్న అనంతరం పట్టణంలోని రైతుబజార్, కుళ్లకోనేరు, పాతబస్టాండ్, సీతంపేట ప్రాంతాల్లో పర్యటించారు .అనంతరం ఆయన సర్పంచ్ సంతోషికుమార్, వైస్ సర్పంచ్ మోపాడ కుమార్, వార్డు సభ్యులతో మాట్లాడుతూ కుళ్ల కోనేరు బాగుచేయడం, రైతు బజార్ వద్ద పారిశుద్ధ్యం మెరుగు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, సీతంపేటలో డ్రైన్‌ల నిర్మాణానికి తగిన ప్రతిపాదనలు చేసి పంపించాలని సూచించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ లక్ష్మి, ఎస్.కోట పంచాయతీ ఈఓ కన్నబాబు, వార్డు సభ్యులు కె.ఈశ్వరి, కె.భారతి, వేమలి సావిత్రి, ఎం.కృష్ణవేణి, మజ్జి శేఖర్, గనివాడ శ్రీను, చింతల సత్యవతి పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ



కుమ్మపల్లిలో పింఛన్లు అందజేస్తున్న ఎంపీపీ సత్యవంతుడు, సర్పంచ్ అరుణ



రామస్వామిపేటలో పింఛన్‌దారులతో స్థానిక ప్రజాప్రతినిధులు

వేపాడ: మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు పంపిణీ చేస్తున్నారు. కుమ్మపల్లిలో ఎంపీపీ దొగ్గ సత్యవంతు డు, సర్పంచ్ నౌడు అరుణ 19 మంది లబ్ధిదారులకు శనివారం పింఛన్ డబ్బులను పంపిణీ చేశారు. అలాగే రామస్వామిపేట సచివాలయం వద్ద రామస్వామిపేట, పెదకృష్ణరాజపురం పంచాయతీల్లో లబ్ధిదారులకు సర్పంచ్‌లు వడ్లమాని వర్మ, ముమ్మలూరి జగ్గుబాబు పింఛన్లు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. ఆయా గ్రామాల సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గంట్యాడ: మండలంలో శనివారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానిక ఎస్‌ఐ కిరణ్ కుమార్ నాయుడు తెలిపిన వివరాలు.. మండల కేంద్రం గంట్యాడకు చెందిన రాళ్లపూడి ఎర్రినాయుడు ద్విచక్రవాహనంపై కొర్లాం వైపు వెళుతుండగా ధర్మవరం నుంచి విజయనగరం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఎర్రి నాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందజేశారు. క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

గంట్యాడ: మండలంలోని నరవ గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు శనివారం సాయంత్రం దాడి చేశారు. ఎస్‌ఐ కిరణ్‌కుమార్ నాయుడు తెలిపిన వివరాలు.. నరవ గ్రామంలో పేకాట ఆడుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు దాడి చేశామన్నారు. పేకాట ఆడుతున్న ఆరుగురును అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 3,800 స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఆక్రమణల గుర్తింపు



చెరువు భూభాగాన్ని సర్వే చేస్తున్న సిబ్బంది

శృంగవరపుకోట: మండలంలోని కిల్తంపాలెం గ్రామపరిధి పిల్లివాని చెరువు గర్భాన్ని పలువురు ఆక్రమించేశారని, చెరువులో సాగునీరు నిల్వ సామర్థ్యం తగ్గి ఆయకట్టు భూములకు నీరు అందడంలేదని గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మండల సర్వేయర్ వెంకటరావు సర్వే సిబ్బందితో కలిసి చెరువును శనివారం సర్వే చేసి ఆక్రమణలను నిర్ధారించారు. మండల సర్వేయర్ వెంకటరావు మాట్లాడుతూ పదిమంది ఆక్రమణదారులు సుమారు రెండెకరాల విస్తీర్ణం ఆక్రమించినట్లు ప్రాథమికంగా గుర్తించామని చెప్పారు. ఎవరు ఎంత విస్తీర్ణం ఆక్రమించారన్న వివరాలతో నివేదికను జిల్లా అధికారులకు పంపుతామని వివరించారు.

నిత్యాన్నదానానికి విరాళం



లక్ష రూపాయల విరాళం అందజేస్తున్న జగన్నాథరావు, తదితరులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు ఆలయంలో నిత్యాన్నదానానికి విశాఖ జిల్లా దొండపర్తికి చెందిన జగన్నాథరావు, సూర్యారావు, అప్పలనరసయ్య, పరమేశ్వరరావు, ఈశ్వరమ్మ లక్ష రూపాయల విరాళాన్ని శనివారం అందజేశారు. వారి తల్లిదండ్రులు సూర్యప్రకాశరావు, శాంతామణిల జ్ఞాపకార్థం విరాళం అందజేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్మృతి వనానికి సహకరించండి



ఎస్.కోటలో ఆలయం వద్ద మట్టిని సేకరిస్తున్న బీజేపీ నాయకులు

శృంగవరపుకోట: దేశం కోసం ప్రాణాలు అర్పించిన అమరవీరుల స్మృత్యార్థం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా స్మృతి వనం ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పట్టణ బీజేపీ నాయకులు కోరారు. ప్రతీ ఇంటి నుంచి చిటికెడు మట్టి సేకరించాలన్న బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు పట్టణంలో శనివారం మట్టి సేకరణ చేపట్టారు. 'నాభూమి–నాదేశం' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణంలోని దుర్గాదేవి, దారగంగమ్మ, గణేష్ ఆలయాల్లో మట్టిని ఆయా దేవాలయాల అర్చకుల నుంచి స్వీకరించారు. అనంతరం ఇంటింటా మట్టి సేకరణ చేశారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా స్టేట్ కార్యవర్గ సభ్యులు ఎలమంచిలి ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి డి.సూర్యారావు, బీజేపీ మండల అధ్యక్షుడు డి.దాశరథి, నాయకులు చిరంజీవిరావు, పదాల రవి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం



చీపురుపల్లి: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి విజయరామేశ్వరి



శృంగవరపుకోట: కేసులను పరిష్కరిస్తున్న న్యాయమూర్తి వాణి



మెంటాడ(గజపతినగరం రూరల్): లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి కనకలక్ష్మి

చీపురుపల్లి: జాతీయ లోక్‌అదాలత్ ద్వారా కేసులను రాజీ కుదుర్చుకుంటే ఇరువర్గాలకూ సత్వర న్యాయం లభిస్తుందని స్థానిక కోర్టు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం. విజయరామేశ్వరి అన్నారు. పట్టణంలోని కోర్టు హాల్‌లో శనివారం జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. సివిల్, క్రిమినల్‌తో పాటు ఇతర కేసులను 1,308 రాజీ చేశారు. అంతకుముందు ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు ఎంతో విలువైన సమయం మిగులుతుందన్నారు. లోక్‌అదాలత్ సభ్యులు భోగాపురపు శ్రీదేవి, మెహర్ ప్రసాద్ పాల్గొన్నారు.

1,153 కేసుల పరిష్కారం

శృంగవరపుకోట: జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా పట్టణంలోని స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం నిర్వహించిన మెగా లోక్‌అదాలత్‌లో 1,153 కేసులు పరిష్కారం అయ్యాయని కోర్టు వర్గాలు తెలిపాయి. జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని మండల న్యాయ సేవా కమిటీ చైర్ పర్సన్, ఎస్.కోట మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి సబ్బ వరపు వాణి ఇచ్చిన పిలుపు మేరకు స్థానిక న్యాయవాదులు, వివిధ శాఖల అధికారులు కక్షిదారుల మధ్య రాజీ యత్నాలు చేశారు. న్యాయమూర్తి వాణి మాట్లాడుతూ కక్షిదారులు రాజీ మార్గా న్ని ఎంచుకుంటే ఇరువర్గాలు విజయం సాధించినట్టే అన్నారు. 1,054 క్రిమినల్, 11 సివిల్, 8 చెక్‌బౌన్స్, 79 ప్రిలిటిగేషన్ కేసులు, ఒక మనోవర్తి కేసు రాజీ అయినట్టు చెప్పారు. కేసుల పరిష్కా రానికి సహకరించిన న్యాయవాదులు, ఆయా శాఖల అధికారులు, బ్యాంకర్లకు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

రాజీయే రాజమార్గం

మెంటాడ(గజపతినగరం రూరల్): కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోకుండా రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్‌అదాలత్‌లో రాజీకుదుర్చుకోవాలని, రాజీయే రాజమార్గమని గజపతినగరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి కనకలక్ష్మి అన్నారు. కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. 805 కేసులను రాజీ చేశారు. లోక్ అదాలత్ మెంబర్లు లెంక రాంబాబు,టి.దేవుడుబాబు తదితరులు పాల్గొన్నారు.

గౌర్రిపాటి విగ్రహం ఏర్పాటుకు స్థల పరిశీలన



తాటిపూడి జలాశయం వద్ద స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

గంట్యాడ: గౌర్రిపాటి బుచ్చి అప్పారావు(తాటిపూడి) జలాశయం వద్ద బుచ్చి అప్పారావు విగ్రహాన్ని మూడు నెలల్లో ఏర్పాటు చేస్తామని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తెలిపారు. మండలంలోని తాటిపూడి జలాశయం వద్ద బుచ్చి అప్పారావు విగ్రహం ఏర్పాటుకు శనివారం స్థల పరిశీలన చేశారు. విగ్రహాలను ఎక్కడ బాగా తయారు చేస్తారో తెసుకుని విగ్రహం కోసం ఆర్డర్ ఇవ్వాలని, ఖర్చుకు వెనుకాడొద్దని పార్టీ నేతలకు ఎమ్మెల్యే సూచించారు. బుచ్చి అప్పారావు స్వాతంత్ర్య సమరయోధుడని, జిల్లా అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారని అన్నారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్ , నారాయణమూర్తిరాజు, జామి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె రవికుమార్, పాండ్రంగి సంజీవి, ఇరిగేషన్ అధికారులు పాండు, తమ్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికి ఊతం



కృష్ణారాయుడుపేటలో లబ్ధిదారులకు పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి

వేపాడ: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల ఆర్థికాభివృద్ధికి ఊతంగా నిలుస్తున్నాయని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కుమ్మపల్లి సచివాలయం పరిధిలోని కృష్ణారాయుడుపేట, అంకా జోస్యులపాలెం గ్రామాల్లో శనివారం సాయంత్రం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పథకాల ద్వారా ప్రతీ కుటుంబానికి కలిగిన లబ్ధిని వివరించడంతో పాటు సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల హామీలను 99శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గ్రామ సచి వాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేశామన్నారు. ప్రతినెలా ఒకటో తేదీన ఉదయాన్నే తలుపు తట్టి అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులకు ఇంటి వద్దే పెన్షన్ అందిస్తున్నామన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా గ్రామాల్లోనే రైతులకు విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తున్నామని చెప్పారు. విద్య, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే నాడు- నేడు ద్వారా వేలకోట్ల రూపాయలను ఖర్చు చేసి పాఠశాలలు, ఆస్పత్రులను ఆధునికీకరిస్తోందని తెలిపారు. వైఎస్సార్ హెల్త్ విలేజ్ క్లినిక్‌లతో పాటు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని వివరించారు. డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకటచినరామునాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, కొత్తవలస ఏఎంసీ చైర్‌పర్సన్ మూకల కస్తూరి, సర్పంచ్ చెలుబోను ముసలినాయుడు (బాలబాబు), మాజీ సర్పంచ్ పైడిబాబు, మండల జేసీఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ముమ్మలూరి జగ్గుబాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, నాయకులు దొగ్గ స్వప్నకుమారి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.